


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 146 | 20-08-2026 గురువారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00



ఇరాన్ క్షిపణి దాడులపై

## అరబ్ ఆగ్రహం

ఇరాన్‌తో అన్ని వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈ ఈ చర్య తీసుకుంది. ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా... ఇరాన్‌తో అన్ని వాణిజ్య, వ్యాపార వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేశామని యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అఫ్రా అల్ హమెలీ తెలిపారు.

వివరాలు 2లో..



కశ్మీర్‌లోకి 10వేల మంది

## ఉగ్రవాదుల తరలింపు

పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ మతబోధకుడు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని బహావల్‌నగర్‌లో ఆగస్టు 14న జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన నసీర్ మాద్నీ కశ్మీర్ గురించి పలు సంచలన వ్యాఖ్యలు చేశాడు.

బాంబు పేల్చిన

## సుష్మితా పటేల్



మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మితా పటేల్ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ కాక రేపుతున్నాయి. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మితా పటేల్ సంచలన ప్రకటన చేశారు. పరకాల నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

సిఎం రేవంతా..

పొంగులేటా...అర్థం కావడం లేదు

కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వకుంటే ఒంటరిపోరాటం

తెలంగాణ రాజకీయాల్లో కాక రేపిన కొండా సురేఖ తనయ

వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి మల్లు రవి



బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు

### నటి నిధి అగర్వాల్‌కు ఇడి ప్రశ్నలు

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌కు సంబంధించిన కేసులో సినీ నటి నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. విచారణలో ఆమె ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం.

టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు

## బిఆర్ఎస్ పిలుపు

హరీష్ రావు, తలసాని శ్రీనివాస యాదవ్‌ల హౌజ్ అరెస్ట్



మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కోకాపేట్‌లోని హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ సందర్శనకు హరీశ్ రావు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స్' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులను పరుగులు పెట్టించారు.



కోల్‌కతా హోటల్‌లో

## అగ్నిప్రమాదం

అర్థరాత్రి జరిగిన ప్రమాదంలో 9మంది మృత్యువాత

మృతులంతా చికిత్స కోసం వచ్చిన బంగ్లాదేశీయులుగా గుర్తింపు



## నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

సంస్కరణలపై సుప్రీంలో విచారణ

### రాయదుర్గం పోలీసులకు కోర్టు నోటీసులు

హైదరాబాద్,

పోక్సో కేసులో నిందితుడిని వేధించి చిత్రహింసలకు గురిచేశారన్న ఆరోపణల నేపథ్యంలో రాయదుర్గం పోలీసులకు రాజేంద్రనగర్ కోర్టు నోటీసులు జారీ చేసింది. రిమాండ్ సమయంలో నిందితుడి ఒంటిపై గాయాలను న్యాయవాది కోర్టుకు చూపించారు. దీంతో రాజేంద్రనగర్ కోర్టు తక్షణమే నిందితుడిని విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. నిందితుడిని వేధింపులకు గురిచేసిన అంశంపై షోకాజ్ నోటీసులు జారీచేసింది. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని రాయదుర్గం పోలీసులను కోర్టు ఆదేశించింది. నిందితుడి రిమాండ్ రిజెక్ట్ చేస్తూ బెయిల్ మంజూరు చేసింది.

### డ్రగ్స్ రాకెట్ ముఠా గుట్టురట్టు

ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారుల అరెస్ట్

హైదరాబాద్,

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు. బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం.



కొండా సుస్మిత

### వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం: మల్లు రవి

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు.

రైతుల ఆదాయాన్ని పెంచడమే

## బ్యాంకుల లక్ష్యం



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు కీలక సూచనలు చేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు.

వార్త 2లో

# ఇరాన్ క్షిపణి దాడులపై అరబ్ ఆగ్రహం

### ఇరాన్‌తో వాణిజ్య బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటన

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

ఇరాన్‌తో అన్ని వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈ ఈ చర్య తీసుకుంది. ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా... ఇరాన్‌తో అన్ని వాణిజ్య, వ్యాపార వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేశామని యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అఫ్రా అల్ హమెలీ తెలిపారు. మరో క్షిపణి ముప్పు గురించి దేశ ప్రజల్ని హెచ్చరిస్తూ ఫోన్ అలర్ట్ జారీ చేసిన దాదాపు రెండు గంటల తర్వాత యూఏఈ ఈ ప్రకటన చేసింది. 'ప్రస్తుత పరిస్థితి, క్షిపణి ముప్పు కారణంగా, వెంటనే ప్రజలు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని యూఏఈ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ సదరు ఫోన్ అలర్ట్‌లో పేర్కొంది. అయితే, ఆ అలర్ట్‌ను కొద్దిసేపటికే ఉపసంహరించారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి, ఇరాన్ దాడుల తీవ్రతను యూఏఈ ఎక్కువగా ఎదుర్కొంది. ఈ ప్రాంతంలోని మరే ఇతర దేశం కంటే ఎక్కువగా, దాదాపు 3,000 క్షిపణులు, డ్రోన్‌లు ఆ దేశంపై ఇరాన్ ప్రయోగించింది. గల్ఫ్‌లోని నౌకా రవాణాపై ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆరోపించగా, ఈ ఆరోపణను ఇరాన్ ఖండించింది. ఇరాన్ తమ దేశం వైపు క్షిపణిని ప్రయోగించిందన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వాదనను ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ ఖండించారు. ఈ వాదన ప్రాంతీయ విశ్వాసానికి, భద్రతా ప్రయత్నాలకు హానికరమని ఆయన పేర్కొన్నారు.

# కశ్మీర్‌లోకి 10వేల మంది ఉగ్రవాదుల తరలింపు

### నసీర్ మాద్నీ సంచలన వ్యాఖ్యలు

**లాహోర్,**

పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ మతబోధకుడు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని బహావల్‌నగర్‌లో ఆగస్టు 14న జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన నసీర్ మాద్నీ కశ్మీర్ గురించి పలు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఉగ్రసంస్థ ఎల్ఈటీ చీఫ్ హాఫీజ్ సయీద్ కశ్మీర్‌లోకి 10 వేల మంది ఉగ్రవాదులను పంపించినట్టు చెప్పాడు. దీంతో, కశ్మీర్‌లో ఉగ్ర నెట్‌వర్క్ వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం అవుతోంది. హాఫీజ్ సయీద్ సారథ్యంలోని లష్కరే తొయిబా భారత్‌లో అనేక దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి హాఫీజ్‌పై పలు కేసులు నమోదయ్యాయి. 26/11 దాడుల్లో మంది పాక్ ఉగ్రవాదులు సముద్రమార్గంలో ముంబైలోకి ప్రవేశించి నాలుగు రోజుల పాటు మారణహోమం సృష్టించారు. ఈ ఉగ్రవాద దాడిలో 166 మంది మరణించగా 300 మంది గాయపడ్డారు. ఇక గతేడాది పహల్గాం దాడిలో 26 మంది సాధారణ పౌరులు కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి జమ్మూలోని కోర్టు హాఫీజ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఐక్యరాజ్య సమితి, అమెరికా కూడా ఎల్ఈటీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాయి.

# బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు

### నటి నిధి అగర్వాల్‌కు ఇడి ప్రశ్నలు

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

బెట్టింగ్ యాప్స ప్రమోషన్స్‌కు సంబంధించిన కేసులో సినీ నటి నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన విచారణలో ఆమె ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ప్రమోషనల్ కార్యక్రమాలకు సంబంధించి కుదుర్చుకున్న కాంట్రాక్టులు, వాటి కాలపరిమితి, ప్రచారం కోసం అందించిన కంటెంట్, సోషల్ మీడియా లేదా ఇతర వేదికల ద్వారా నిర్వహించిన ప్రమోషన్స్‌పై కూడా ఈడీ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇక బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు నిధి అగర్వాల్‌కు అందిన రెమ్యునరేషన్‌పై కూడా ఈడీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఒక్కో ప్రమోషన్‌కు ఎంత మొత్తంలో పారితోషికం తీసుకున్నారు, ఆ మొత్తాలు ఏ విధంగా చెల్లించబడ్డాయి, ఎవరి నుంచి చెల్లింపులు వచ్చాయి వంటి అంశాలపై అధికారులు వివరాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స నిర్వాహకులు లేదా వారికి సంబంధించిన వ్యక్తులు నిధి అగర్వాల్ బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసిన డబ్బు లావాదేవీలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఆ చెల్లింపులు ప్రమోషనల్ కాంట్రాక్టులకు సంబంధించినవేనా, వాటికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా అనే అంశాలపై కూడా విచారణ జరిగినట్లు తెలుస్తోంది.

# టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బిఆర్ఎస్ పిలుపు

### హరీష్ రావు, తలసాని శ్రీనివాస యాదవ్‌ల హౌజ్ అరెస్ట్

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కోకాపేట్‌లోని హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ సందర్శనకు హరీశ్ రావు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స్' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులను పరుగులు పెట్టించారు. అసెంబ్లీ ఎన్నికల సమయానికి అంటే ఏడాది కాలంలోనే అన్ని దవాఖానల నిర్మాణ పనులు 60 శాతానికిపైగా పూర్తయ్యాయి. గత సంవత్సరమే మూడు సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ప్రస్తుతం సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే హడావుడిగా ప్రారంభోత్సం చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్ రావు హాస్పిటల్ సందర్శనకు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. నత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది. అలాగే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సనత్ నగర్‌లో నూతనంగా ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని బీఆర్ఎస్ హై కమాండ్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, అడ్డుకునేందుకు తమను హౌస్ అరెస్ట్‌లు, అక్రమ నిర్బంధాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సనత్ నగర్, అమీర్‌పేట డివిజన్‌లకు చెందిన ముఖ్య నాయకులను పోలీసులు ఎందుకు హౌస్ అరెస్ట్ చేశారని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.



# బాంబు పేల్చిన సుష్మితా పటేల్

### సిఎం రేవంతా.. పొంగులేటా...అర్థం కావడం లేదు

### కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వకుంటే ఒంటరిపోరాటం

### తెలంగాణ రాజకీయాల్లో కాక రేపిన కొండాసురేఖ తనయ

### వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి మల్లు రవి

**వరంగల్, అక్షరకలం ప్రతినిధి**

మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మితా పటేల్ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ కాక రేపుతున్నాయి. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మితా పటేల్ సంచలన ప్రకటన చేశారు. పరకాల నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

పరకాల నియోజకవర్గ రాజకీయాలపై సుష్మితా పటేల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్ రెడ్డి వ్యవహారశైలిలో మార్పు వచ్చిందని అన్నారు. 'పొంగులేటి



ముఖ్యమంత్రా.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా? అసలు ఎవరు సీఎం అనేది అర్థం కావడం లేదు' అని సుష్మితా వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు తన తండ్రి కొండా మురళీ కూడా సహకరించారని సుష్మితా పటేల్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే సమయంలో కొండా మురళీ సహకారం ఉందని అన్నారు. అందుకు ప్రతిఫలంగా కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఇక్కడి మైసమ్మపై ప్రమాణం చేయగలరా? అని సుష్మితా పటేల్ సవాల్ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ మధ్య పోటీ జరుగుతోందని వ్యాఖ్యానించారు. రేవూరి ప్రకాశ్ రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని సుష్మితా పటేల్ ప్రశ్నించారు. దమ్ముంటే రాజీనామా చేయించి ఇప్పుడే ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. తమ ఇలాఖాకు వచ్చి తమతో ఎందుకు పెట్టుకుంటున్నారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన అవినీతిపై ఇప్పటివరకు రూ.200 కోట్ల వ్యవహారాన్ని మాత్రమే బయటపెట్టానని సుష్మితా పటేల్ ఆరోపించారు. తనపై కౌంటర్ ఇస్తే మరిన్ని విషయాలను బయటపెడతానని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల సమయానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారో, ఉండరో కూడా సందేహమేనని సుష్మితా పటేల్ వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పూర్తి వివరాలు తెప్పించుకున్న తర్వాత ఆమెపై పార్టీ పరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# కోల్‌కతా హోటల్‌లో అగ్నిప్రమాదం

### అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో 9మంది మృత్యువాత

### మృతులంతా చికిత్స కోసం వచ్చిన బంగ్లాదేశీయులుగా గుర్తింపు

**కోల్‌కతా, అక్షరకలం ప్రతినిధి**

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని మిర్జా గాలిబ్ వీధిలో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో 9 మంది చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. రాత్రి 1.45 నిమిషాలకు ప్రమాదం చోటుచేసుకున్నది. అగ్నిమాపక సిబ్బంది తో పాటు పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. దట్టమైన పొగ కమ్ముకోవడం వల్ల పై అంతస్తులకు చేరుకోవడానికి అగ్నిమాపక సిబ్బంది ఇబ్బందిపడింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో ఓ చిన్నారి సహా 9 మంది మృతి చెందారు. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో అర్ధరాత్రి 2 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పలువురు చిక్కుకుపోయి మరణించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారందరూ బంగ్లాదేశీయులేనని అగ్నిమాపక శాఖ తెలిపింది. మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం వారు కోల్‌కతాకు వచ్చారని అధికారులు తెలిపారు. ఏసీ పేలడంతో మూడో అంతస్తులో మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఘటనకు గల కారణం ఇంకా వెల్లడించలేదు. మంటలు చెలరేగగానే హోటల్‌లోని కొందరు బయటకు పరుగుతీశారు. అగ్నికీలలు చుట్టూ ఉన్న ఇళ్లవైపు వ్యాపించడంతో ప్రజలు హాహాకారాలు చేశారు. ఘటన గురించి తెలియగానే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాలుగు ఫైర్ ఇంజన్ల సాయంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చారు. దట్టమైన పొగ వ్యాపించడంతో సహాయ కార్యక్రమాలకు కాస్త అంతరాయం ఏర్పడిందని ఓ పోలీసు అధికారి తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం బిర్భూమ్ జిల్లాలోని ఓ హోటల్ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 8 మంది మరణించగా పలువురు గాయపడ్డారు.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

### సంస్కరణలపై సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ,**

నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్–2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

# రైతుల ఆదాయాన్ని పెంచడమే బ్యాంకుల లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్,**

స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు కీలక సూచనలు చేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. మీవీజులకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. జ+uమీజు కింద రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు.క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు. –

# కొండా సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం: మల్లు రవి

**ఢిల్లీ:**

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని మల్లు రవి స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.గతంలోనూ షబ్బీర్ అలీ, కొండా మురళీ మధ్య వివాదం తలెత్తినప్పుడు వారితో చర్చించి సమస్యను పరిష్కరించినట్లు మల్లు రవి తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ నేత రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ నాయకుల మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించినట్లు మల్లు రవి తెలిపారు.ఈ క్రమంలోనే కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని పీసీసీ చీఫ్‌ను కోరారు. దీంతో సుస్మితపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు

### హత్యకు పాల్పడింది ..అదే స్కూల్‌లోని ఇద్దరు టెన్త్ స్టూడెంట్స్

### జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ప్రిన్సిపల్ హత్య

### వివరాలు తెలియడంతో విస్తుపోయిన టీచర్లు, స్టూడెంట్స్

**నల్గొండ**

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె.రూపారెడ్డి హత్య కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆమె నిర్వహిస్తున్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులే రూపారెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. డబ్బుల కోసమే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనలో విద్యార్థుల పాత్ర బయటకు రావడంతో తోటి విద్యార్థులు,టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి దుర్మార్గానికి ఒడిగడతారని అనుకోలేదని అంటున్నారు. ఈ నెల 11న కొండమల్లేపల్లి మండలంలోని వేర్వేరు తండాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మాస్క్, హుడీ ధరించి రూపారెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. ఒక విద్యార్థి ఇంట్లోకి వెళ్లి డబ్బులు ఇవ్వాలని బెదిరించగా.. ఆమె ప్రతిఘటించారు. మాస్క్ ఊడిపోవడంతో విద్యార్థిని గుర్తించి కేకలు వేశారు. గుర్తింపు బయటపడటంతో వెంట తీసుకెళ్లిన కత్తితో రూపారెడ్డిని పొడిచి హత్య చేశాడు. అనంతరం ఇంట్లో ఉన్న రూ.2.20లక్షలు తీసుకుని బయట ఉన్న మరో విద్యార్థికి రూ.40వేలు ఇచ్చాడు. ఇద్దరు విద్యార్థులు చోరీలు చేస్తూ జల్సాలకు అలవాటు పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. విచారణ సమయంలో విద్యార్థి జేబులో ఉన్న రూ.1.60లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు రక్తపు మరక ఉండటాన్ని గుర్తించారు. రక్తపు మరకలపై ప్రశ్నించడంతో విద్యార్థులు నిజం అంగీకరించారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,**

భారత్‌లో ఈ వారం మొదటి నుంచీ బంగారం ధరలు ప్రతి రోజూ ఓ మోస్తరు స్థాయిలో పెరుగుతూనే ఉన్నాయి. యూఎస్ ఫెడ్ ప్రామాణిక వడ్డీ రేటు పెరగదన్న అంచనాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారు. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఆగస్టు 19) ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,900గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,42,910 వద్ద కొనసాగుతోంది.



# పల్లె పల్లెకు పొన్నమన్న

## పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమం ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ హైమావతి

**అక్షర కలం, సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19**

: బుదవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో హుస్నాబాద్ నియోజకవర్గం జిల్లాలో మూడు మండలాలోనీ గ్రామాల్లో త్వరలో రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించబోయే "పల్లె పల్లె కు పొన్నమన్న, పల్లె పల్లెలో ప్రజాపాలన" కార్యక్రమ ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హైమావతి జూమ్ సమావేశం ద్వారా ఆయా శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ మూడు మండలాలు కోహెడ, అక్కన్న పేట, హుస్నాబాద్ మండలంలో "పల్లె పల్లె కు పొన్నమన్న, పల్లె పల్లెలో ప్రజాపాలన" ద్వారా రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామంలో ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వం నుండి ప్రజలకు అందుతున్న పథకాలు గ్రామాల్లో సమస్యలు గూర్చి నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు.గ్రామపంచాయతిలో సభ ఏర్పాటు టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టమ్, అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో సభలో తెలిపిన దరఖాస్తులను నోట్ చేసుకుని, ఏ స్థాయిలో పరిష్కరించవచ్చు ప్రతిదీ రికార్డు చేసుకుని, ఫైలింగ్ చేసుకోవాలని ఏంపిడిఓలను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు వివరాలు, కొత్త రేషన్ కార్డులు సభ్యుల




చేర్చిన వివరాలు, గ్యాస్ సబ్సిడీ, సన్నబియ్యం పంపిణీ మరియు సన్నవడ్లకు బోనస్, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సరఫరా లబ్ధిదారులు, రైతు భరోసా మరియు రైతు బీమా పథకాలు లబ్ధిదారులు, కళ్యాణ లక్ష్మీ షాదిముబారక్ చెక్కులు, వడ్డీలేని రుణాలు పంపిణీ, ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన వివరాలతో జాబితా తయారు చేసి గ్రామ సభలో పెట్టాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామంలో శాఖల వారిగా శాంక్షన్ అయిన పనులు, పనుల పురోగతి గూర్చి శాఖల వారిగా సమీక్ష జరుపుతారన్నారు. ప్రతి పనికి ఒక నిర్ణిత కాలం పెట్టీ, ఆ నిర్ణిత కాలవ్యవధిలో పూర్తి చెయ్యాలని ఆదేశించారు. గ్రామంలో ప్రాధాన్యత అంశాలు డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ, సిసి రోడ్లు, స్ట్రీట్ లైట్స్ ఎలాంటి సమస్యలు ఉన్నా ముందుగా తేలుకోవాలని ఆదేశించారు. పాఠశాలు, అంగన్వాడిలో పిల్లల వివరాలు, వారికి అందించే పౌష్టికాహారం గూర్చి ప్రతి విషయం గూర్చి సమాచారం అధికారులవద్ద ఉండాలని సూచించారు. గ్రామసభలో వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు శాఖల వారిగా అప్లికేషన్స్ తీసుకోవడానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి ఈ ప్రోగ్రామ్ గూర్చి ప్రతి గ్రామం మానిటర్ చేస్తూ, కార్యక్రమం విజయవంతం చెయ్యాలని ఆదేశించారు.

# కోయిల్‌సాగర్ నీటి విడుదలతో రైతులకు భరోసా :

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు,19)**

నారాయణపేట: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి నారాయణపేట--దేవరకద్ర నియోజకవర్గ




రైతుల ప్రయోజనార్థం ఈ రోజు నీటిని విడుదల చేసింది. కుడి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడమే ద్వారా చెరువులు, కుంటలు నిండుతూ భూగర్భ జలాలు పెరుగుతూ బోర్లలో నీటిమట్టం మెరుగవుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.ఎం.ఆర్. జి. మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి, నారాయణపేట మార్కెట్ చైర్మన్ సదాశివ రెడ్డి (కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు), జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సూర్యమోహన్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. దేవరకద్ర మండల అధ్యక్షురాలు అంజలి రెడ్డి, మరికల్ మండల అధ్యక్షుడు బొక్కల హర్షవర్ధన్ రెడ్డి, ధన్వాడ మండల అధ్యక్షుడు గురువా రాజు, మరికల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కాటికొండ ఆంజనేయులు, మరికల్ టౌన్ అధ్యక్షుడు హరీష్, మరికల్ సర్పంచ్ గుప్ప చెన్నయ్య, బెలగుంది వీరన్న పెంట మీద రఘు దామోదర్ రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ నారాయణపేట జిల్లా అధ్యక్షులు దామోదర్ రెడ్డి, పి. రామకృష్ణారెడ్డి, పదవ వార్డు మెంబర్ పోలేముని అశోక్, టైసన్ రఘు, మల్లారెడ్డి, సద్దాం సర్పంచులు, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, రైతులు మరియు స్థానిక ప్రజలు కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఈలు, ఏఈలు మరియు సంబంధిత ఇరిగేషన్ అధికారులు కూడా హాజరయ్యారు. నేతృత్వం వైపు నుండి తెలియజేయబడిన ప్రకారం, రైతుల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అనే నమ్మకంతో ఈ చర్య చేపట్టబడింది. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది" అని స్థానిక నేతలు అభివృద్ధి వ్యాఖ్యానించారు.

# కార్మికుల ఆర్థిక ప్రయోజనాలపై యాజమాన్యం అలసత్వం తగదు

**మందమర్రి, ఆగస్టు 19 అక్షర కలం:**

సింగరేణి యాజమాన్యం కార్మికులకు అందించే ఆర్థిక ప్రయోజనాలపై అలసత్వం ప్రదర్శించడం తగదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్, బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి లు తెలిపారు. ఏరియాలోని కాసిపేట 1 గని యూనియన్ పిట్ కార్యదర్శి నాగవల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో కాసీపేట 1ఏ గనిని సందర్శించి, ఇటీవల సర్ఫేస్ కు వచ్చిన జనరల్ అసిస్టెంట్ల బేసిక్ తగ్గుదలపై కోర్టు ఇచ్చిన తీర్పు వివరాలను కార్మికులకు తెలిపి, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అల్లి రాజేందర్, ఎస్ వెంకటస్వామి లు మాట్లాడుతూ, కాసీపేట 1ఏ గని నూతనంగా ఏర్పడినందున గనిపై కావల్సిన మౌలిక సదుపాయాలు యాజమాన్యం ఏర్పాటు చేయడంలో మరింత వేగవంతం చేయాలన్నారు. కార్మికుల వేతనాల నుండి ప్రతినెల రికవరీ చేస్తున్న సీఎంపీఎఫ్ వివరాలను గత ఆర్థిక సంవత్సరం గడిచి, ఐదు నెలలైనా ఇప్పటికీ జమ చేయకపోవడం సరికాదని, వెంటనే అప్డేట్ చేయించి, వడ్డీ రేటు కల్పించాలని డిమాండ్ చేశారు. సిఎంపిఎఫ్ వివరాల కొరకు ఆన్లైన్ పోర్టల్ ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేదని, వెంటనే అందులో ఉన్న ఇబ్బందులను సరి చేసి, కార్మికులందరికి అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. సిఎంపిఎఫ్



అధికారులతో ఏరియా సమావేశాలలో పాల్గొన్నప్పుడు గుర్తింపు సంఘాల నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు. సిఎంపిఎఫ్ వివరాల మాదిరిగానే గత ఆర్థిక సంవత్సరం లాభాలను యాజమాన్యం ఇప్పటికీ కార్మికులకు వెల్లడించకపోవడం సరికాదన్నారు. సంస్థ అభివృద్ధి కొరకు నిధులు గత రెండు సంవత్సరాలుగా నిధులు కేటాయించినా, గతంలో లేని విధంగా ఈ మధ్య కాలంలో అన్ని గనులపై బూట్లు, బిట్లు, క్యాప్సుల్స్ వంటి పనిముట్లు, ఇతర మెటీరియల్ కొరత ఎందుకు ఏర్పడుతుందని ప్రశ్నించారు. మరోవైపు యాజమాన్యం కొత్త కొత్త నిబంధనలు తీసుకువచ్చినా గెలిచిన సంఘం స్పందించకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు దెబ్బటి శ్రీనివాస్, గని కార్మికులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో కోతుల బెడద నియంత్రణపై పటిష్ట చర్యలు....

**- స్థానిక శాసనసభ్యుల, ప్రజా ప్రతినిధుల సహకారంతో...**

**- ప్రత్యేక కార్యాచరణ ద్వారా వడి వడిగా ముందుకు పోవాలి....**

**- రైతులకు కోతుల బెడదను తప్పించాలన్న విషయంలో కృతనిశ్చయంతో పనిచేయాలి....**

**- కోతులను పట్టి వాటిని నిర్మల్ జిల్లాకు తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ద్వారా సంతతి పెరగకుండా చూడటం....**

**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్....**

**మెదక్, ఆగస్టు 19(అక్షర కలం):**

మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్స్, అటవీ జిల్లా పంచాయతీ శాఖ సమన్వయ సమావేశంలో కలెక్టర్ వెల్లడించారు. మెదక్ జిల్లాలో కోతుల బెడద నివారించడానికి స్థానిక శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో వేగవంతమైన కార్యాచరణతో ముందుకు కదరాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ సంబంధిత మున్సిపల్ కమిషనర్ ను



ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చాంబర్లో కో తుల బెడద నివారణపై డీఎఫ్ఓ జోజి, డిపిఓ యాదయ్య, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్స్ తో కలెక్టర్ ప్రతిమాసింగ్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ జిల్లాలో కోతుల బెడద తీవ్ర రూపం దాల్చడంతో అనేక పర్యాయాలు రైతుల నుండి ప్రజల నుండి పంటలను ధ్వంసం చేస్తున్నాయని, ఇండ్లలో దూరి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని, చదువుకునే విద్యార్థిని విద్యార్థులు కూడా వీటి దాడిలో గాయపడ్డ సన్నివేశాలు ఉన్నాయనీ ప్రజావాణిలో అనేక విన్నపాలు రావడం జరిగిందని, అనేకమంది ప్రజలు , రైతులు కోతులతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాటి నుండి పూర్తిగా విముక్తి చేయాలనే సదుద్దేశంతో క్షేత్రస్థాయిలో రైతుల పంటలను కాపాడాలని, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, ప్రజల సహాయ సహకారాలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కోతులను పట్టడానికి వాటిని తరలించడానికి అవసరమయ్యే నిధులపై , ప్రజా ప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహాయ సహకారాలు ఉంటాయన్నారు కోతులను పట్టిన వెంటనే స్థానిక అటవీ అధికారుల ఎఫ్ఆర్ఓ సహకారంతో నిర్మల్ జిల్లాకు తరలించి కుటుంబ నియంత్రణ పద్ధతి ద్వారా వాటిని అక్కడే విడిచి పెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోతుల బెడద నియంత్రణ ఒక ఉద్యమంలో చేపట్టి ముందుకు వెళ్లినట్లయితే దశలవారీగా వాటి నిర్మూలించడానికి అందరి సహాయ సహకారాలు అందుతాయని తద్వారా కోతుల నియంత్రణ జిల్లాగా మెదక్ జిల్లా అని తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అటవీ అధికారి జోజి, డిపిఓ యాదయ్య మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులు తమ చుట్టూ ఉన్న పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

**-మున్సిపల్ వైస్ చైర్మన్ ఏ. సత్యనారాయణ**

**-అందోల్ కేజీబీవీలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం**

**అక్షర కలం, అందోలు:**

విద్యార్థినులు తమ చుట్టూ ఉన్న పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అసౌకర్యం లేదా ప్రమాదకర పరిస్థితి ఎదురైనప్పుడు నమ్మకమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని అందోలు-జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఏ. సత్యనారాయణ (చిట్టిబాబు) సూచించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం అందోల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, బాలికల భద్రత సాధికారతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, రక్షణ, సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నాయని తెలిపారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి, ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాలను సాధించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు మాట్లాడుతూ ఆడపిల్ల పుట్టుకను గౌరవించడంతో పాటు ప్రతి బాలికకు నాణ్యమైన విద్య అందించడం, ఆమె ప్రతిభను ప్రోత్సహించడం, స్వయం సాధికారత సాధించేలా చేయడం సమాజం మొత్తం బాధ్యత అని తెలిపారు. విద్య



ద్వారా బాలికలు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడంతో పాటు ఉన్నతమైన కెరీర్ లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థినులు తమ ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా ఉన్నత విద్య, ఉపాధితో పాటు వివిధ వృత్తి అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని వారు పేర్కొన్నారు. కెరీర్ గోల్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ, చిన్న వయస్సు నుంచే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, సమయపాలన, క్రమశిక్షణ, నిరంతర కృషితో వాటిని సాధించాలని అధికారులు సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, తమకు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బాలికల భద్రత, రక్షణపై వారు మాట్లాడుతూ ఈ సేఫ్ టచ్-అన్‌సేఫ్ టచ్ పై విద్యార్థినులకు అవగాహన కల్పించి, తమ శరీరానికి సంబంధించిన వ్యక్తిగత హద్దులను తెలుసుకోవడం, అనుచిత స్పర్శను గుర్తించడం తోపాటు అలాంటి పరిస్థితుల్లో వెంటనే స్పందించడం వంటి అంశాలను వివరించారు.

అదేవిధంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతపై అధికారులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, ఫోటోలు ఇతర వ్యక్తిగత వివరాలను ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడం, వ్యక్తిగత వివరాలను పంచుకోవడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. బాలికల ఆరోగ్యానికి సమతుల్యమైన పోషకాహారం ఎంతో ముఖ్యమని, రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, ధాన్యాలు, పాలు ఇతర పోషక పదార్థాలను తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రక్తహీనతను నివారించేందుకు ఐరన్ ఇతర పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలని, తగినంత నీరు తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం అవసరమని తెలిపారు.

**విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్ల పంపిణీ:**

ఈ సందర్భంగా విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్ బ్యాంకు కింద మొత్తం 3,000 శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు. శానిటరీ ప్యాడ్ల సరైన వినియోగం, భద్రపరిచే విధానం, వినియోగం అనంతరం పరిశుభ్రంగా, సురక్షితంగా పారవేసే విధానంపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట సీడీపీఓ మాధులిక, అందోల్ తహసీల్దార్ మధుకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎంఈఓ కృష్ణ, ఎస్ఓ జ్యోతి, ఇన్‌చార్జి ఎస్ఓ సుకన్య, మెడికల్ ఆఫీసర్ శంకర్, జిల్లా సమన్వయకర్త పల్లవి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎస్ఐ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జెండర్ స్పెషలిస్ట్, విద్యార్థినులతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ "నవీన్ కి " నివాళులర్పించిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

**అక్షర కలం/ కారేపల్లి :**

సింగరేణి మాజీ ఎంపీపీ బానోత్ దేవలా నాయక్ కుమారుడు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వర్గీయ బానోత్ నవీన్ నాయక్ దశదిన కార్యక్రమానికి వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్



నాయక్ హాజరై, వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, నవీన్ నాయక్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సుడా చైర్మన్ చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్,వైరా నియోజకవర్గ పీసీసీ సభ్యులు శ్వడ్డే నారాయణరావు, జిల్లా ఓబీసీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, సింగరేణి మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూరి రాంబాబు, మండల కాంగ్రెస్ నాయకులు అడప పుల్లారావు,జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్,అడ్డగోడ ఐలయ్య , వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మద్దిని శ్రీనివాసరావు, గూగులోత్ హర్ష నాయక్ గోపాల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు

# విద్యపై పెట్టే ఖర్చు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి

**ప్రభుత్వం కల్పించే విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19:**

ప్రభుత్వం విద్యారంగంపై పెట్టే ఖర్చు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి లాంటిదని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో 50 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, స్నానపు గదులు, మరమ్మత్తుల పనులకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిసిపి ఎ భాస్కర్, గిరిజన సంక్షేమ అధికారి సురేష్, మండల తహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమ పాఠశాలకు 50 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులు, 30 లక్షల రూపాయల డిఎంఎఫ్టి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. 10వ తరగతి పూర్తి అయిన తర్వాత విద్యార్థుల కొరకు 200 వందల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 2 వేల 500 మంది విద్యార్థులు చదువుకునేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను వసతి గృహ సదుపాయంతో నిర్మించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో సన్న బియ్యంతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం జరుగుతుందని, విద్యార్థుల సంక్షేమంలో భాగంగా 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని నియామకాలు చేపట్టి విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చెన్నూర్ మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని పూర్తి సౌకర్యాలతో నిర్మించడం జరిగిందని, త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని, ప్రజల సౌకర్యార్థం 23 మంది వైద్యులను నియమించడం జరిగిందని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, రాజ్యాంగంలో పొందుపరిచిన విద్యా హక్కును రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని, మెరుగైన విద్యా విధానం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యాసంస్థలలో మధ్యాహ్న భోజనం, విద్యా బోధన, ఇతర సదుపాయాలపై ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, చెన్నూరు నియోజకవర్గంలో 3 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థినులకు ప్రత్యేకంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి పాఠశాలను విద్యార్థులకు సౌకర్యవంతంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని, తరగతి గదులు, వసతి గదులు, త్రాగునీరు, భోజనశాల ఇతర సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. భీమారంలో భోజనశాల, అదనపు గదులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే మంచిర్యాల జిల్లాలో 6.14 శాతం అదనంగా విద్యార్థుల నమోదు జరిగిందని తెలిపారు. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అక్షర కలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక ల్ఖైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్‌లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను పూ÷–రోత్సహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్‌ఎస్‌జీ, ఎన్‌ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమిసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు. పుణెలో టిఎసిఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్దతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండండం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి పోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్క ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళు తున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా



నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్యాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

# బీచుపల్లి ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని సందర్శించిన కలెక్టర్

### ఆలయ పరిసరాలను శుభ్రంగా సుందరంగా తీర్చిదిద్దాలి

### బీచుపల్లిని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

**గద్వాల్ అక్షర కలం ప్రతినిధి**

బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.
ఆలయ ప్రాంగణానికి చేరుకున్న కలెక్టర్ కు మొదట ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో, మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయ స్వామి ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు కలెక్టర్ ను



సన్మానించి, ప్రసాదాన్ని అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి పురంధర్ బీచుపల్లి క్షేత్ర విశిష్టతను కలెక్టర్ కు తెలియజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆలయ ప్రాంగణం పరిశీలించి భక్తులను ఆకట్టుకునేలా లైటింగ్, ఇతర అలంకరణ చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో చెత్తాచెదారం, పందులను గమనించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత కోసం అవసరమైన సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మినీ పార్క్, ఫౌంటెన్‌ను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా నిర్వహించాలన్నారు. పరిసరాల్లో ఉన్న ఫంక్షన్ హాళ్లను నిబంధనల ప్రకారం నిర్వహించేలా చూడాలన్నారు. ఆలయ పరిసరాల్లోని హోటళ్లను నిబంధనల ప్రకారం అవసరమైన ప్రమాణాలతో నిర్వహించాలన్నారు. నిజాం కొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను పర్యాటక శాఖకు పంపించడం జరిగిందన్నారు. నదీతీరంలో సేవలందిస్తున్న గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్లు, టార్చిలైట్లు, రక్షణ తాళ్లు, రెస్క్యూ బోట్ వంటి పరికరాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.ఈ పర్యటనలో తహసీల్దార్ నరేష్, ఈఓ పురేందర్, పంచాయితీ కార్యదర్శి అరుణ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి.

**ప్రణాళికతో చదివితే మెరుగైన ఫలితాలు.**

**విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి.**

**చదువుతోపాటు క్రీడలు, కళా రంగాల్లోనూ రాణించాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**బీచుపల్లి గురుకుల, ఎర్రవల్లి కేజీబీవీ సందర్శించిన కలెక్టర్.**

**గద్వాల్ అక్షర కలం ప్రతినిధి**

విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని ఫలితంగా తాము అనుకున్న రంగాల్లో రాణించేందుకు వీలవుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.బుధవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి బాలుర గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.



ఈ సందర్భంగా పలు తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. గణితంలో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూనే ఖాన్ అకాడమీ డిజిటల్ లెర్నింగ్ తరగతులు కూడా సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఎఫ్ఏ1 లో వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను తెలుసుకొని మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా, కళా రంగాల్లోనూ రాణించేందుకు ఎక్స్ట్రా కరిక్యులం ఆక్టివిటీస్ లో కూడా పాలుపంచుకునేలా చూడాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఎక్కువమంది 550కు పైగా మార్కులు పొందేలా చదవాలని ఆకాంక్షించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డించాలని, ఫుడ్ కమిటీ సభ్యులు ప్రతి రోజు ఆహారాన్ని తనిఖీ చేయాలన్నారు. వంటగదిని పరిశీలించి అక్కడి స్టోర్ రూమ్ లో వంట సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులను సరైన కొలతలతో కుట్టించాలని ఆదేశించారు. కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి తగు సూచనలు చేశారు. అనంతరం ఎర్రవల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులతో మాట్లాడి వారికి ప్రతిరోజు వడ్డిస్తున్న ఆహారం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కేజీబీవీ కు సంబంధించిన పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులై ఉన్నత చదువులను అభ్యసించి గొప్ప స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు రెగ్యులర్ గా తరగతులకు హాజరై బాగా చదువుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అక్కడి ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ పర్యటనలో గురుకుల ప్రిన్సిపల్ శ్రీనివాస్, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వర్ణలత, తదితరులున్నారు.

# తండ్రి వేధింపులతో విసిగిపోయి కృష్ణా నదిలో దూకిన యువతి

**సమయస్ఫూర్తితో కాపాడిన మత్స్యకారుడు ముదిరాజ్ బాబు**

**పోలీసుల చొరవతో కుటుంబ సభ్యులకు అప్పగింత**

**గద్వాల్ టౌన్ అక్షరకలం:**

కుటుంబంలో తండ్రి వేధింపులు భరించలేక ఓ అవివాహిత మహిళ కృష్ణా నదిలో దూకి ప్రాణాపాయానికి ప్రయత్నించిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం బీచుపల్లి వద్ద చోటుచేసుకుంది. అయితే అదే సమయంలో నదిలో ఉన్న మత్స్యకారుడు ముదిరాజ్ బాబు ఆమెను గుర్తించి వెంటనే బోటుతో అక్కడికి చేరుకుని రక్షించడంతో ప్రాణాపాయం తప్పింది. ఐజ మండలం పులికల్ గ్రామానికి చెందిన యువతి కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. తన తండ్రి మద్యానికి బానిసై ప్రతిరోజూ తల్లితో పాటు కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడని ఆమె ను రక్షించిన అనంతరం తెలిపింది. తండ్రి ప్రవర్తనతో కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నాయని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేసింది.

**గతంలోనూ సోదరి ఆత్మహత్యాయత్నం**

తన సోదరి కూడా గతంలో ఇదే కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని యువతి తెలిపింది. ఆ ఘటన తర్వాత కూడా తండ్రి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని పేర్కొంది. కుటుంబ సభ్యులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.కుటుంబంలో ఎదురవుతున్న వేధింపులతో తీవ్రంగా కలత చెందిన తాను ఇక సమస్యకు పరిష్కారం కనిపించడం లేదనే భావనతో బీచుపల్లి కృష్ణా నది వద్దకు వచ్చి నదిలోకి దూకినట్లు తెలిపింది. అయితే ఆమె నదిలోకి వెళ్లిన విషయాన్ని మత్స్యకారుడు ముదిరాజ్ బాబు గమనించి వెంటనే బోటుతో అక్కడికి చేరుకున్నాడు. ప్రమాదాన్ని గుర్తించిన ఆయన చాకచక్యంగా యువతిని రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చాడు.

**పోలీసుల చొరవతో బంధువులకు అప్పగింత**

ఘటనపై సమాచారం అందుకున్న కొండపేట గజ ఈతగాళ్ల ద్వారా ఇటిక్యాల ఎస్ఐ రవికి సమాచారం చేరింది. వెంటనే ఎస్ఐ రవి సిబ్బంది శ్రీను, రాజశేఖర్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని యువతి వివరాలను సేకరించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు, బంధువులకు సమాచారం అందించి యువతిని వారి వద్దకు అప్పగించారు.

# పంచాయతీ ఉద్యోగ కార్మికులకు వేతనాలు పెంచాలి....

**- మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలనీ**

**ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి వినతి పత్రం... -**

**సిఐటియు జిల్లా కోశాధికారి కె నర్సమ్మ....**

**కొల్చారం, ఆగస్టు19(అక్షర కలం):**

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటీయు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కొ ల్చారం మండలం లో నర్సాపూర్ అసెంబ్లీ నియోజక వర్గ శాసన సభ్యులు వాకిటి సునీతా లక్ష్మా రెడ్డి గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె నర్సమ్మ మాట్లాడుతూ



గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు గ్రామాలలో పారిశుద్ధ్యం మంచినీటి సరఫరా విద్యుత్తు తదితర పనులలో అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న వీరి పట్ల ప్రభుత్వాలు ఎన్ని మారిన ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని రాష్ట్రంలో మల్టీపర్పస్ వర్కర్ విధానం వల్ల 800 పైన కార్మికులు చనిపోయారని గత ప్రభుత్వాన్ని తీసుకొచ్చిన ఈ విధానవల్ల నైపుణ్యం లేని పనులు చేయడం వల్ల కార్మికులందరికీ తీవ్రంగా నష్టం జరుగుతుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ విధానం పూర్తిగా రద్దు చేయాలని రెండో పి అర్ సి పరిధిలోకి కార్మికులకు తీసుకోవాలని కనీస వేతనాల అమలు చేయాలని, జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని ,ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, సౌకర్యాలు మరియు దహన సంస్కారాలకు 30,000 చెల్లించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి సమస్యలుపరిస్కరించాలని అన్నారు. కార్యక్రమంలో మల్లేశం,రవి,ప్రశాంత్ ,సత్యం,మల్లేష్,ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్లు చరిత్రను, జ్ఞాపకాలను భద్రపరిచే కళాకారులు

**-మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ**

**ఇంచార్జి నీలం మధు ముదిరాజ్**

**-ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా**

**ఫోటోగ్రాఫర్ల దినోత్సవం**

**అక్షర కలం, అందోలు:**

ఒక ఫోటో అనేది కేవలం ఒక చిత్రం కాదని, అది ఒక కాలానికి, ఒక సంఘటనకు, ఒక జ్ఞాపకానికి శాశ్వత సాక్ష్యంగా నిలుస్తుందని అ ఫోటో మన జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలను భవిష్యత్ తరాలకు అందించే గొప్ప బాధ్యతను ఫోటోగ్రాఫర్లు నిర్వర్తిస్తున్నారని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యాలయంలో వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగురవేసారు. అనంతరం కేక్ కట్ చేసి ఫోటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ సమాజంలో జరిగే ప్రతి ముఖ్యమైన కార్యక్రమం, ప్రజా ఉద్యమం, సామాజిక పరిణామం, కుటుంబ వేడుకలను చిత్రాల రూపంలో భద్రపరచడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎన్నో సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా నాటి జ్ఞాపకాలను కళ్లముందు నిలిపేది ఫోటోగ్రఫీ అని పేర్కొన్నారు. అందుకే ఫోటోగ్రఫీ వృత్తిని ఎంచుకుని సేవలందిస్తున్న వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని గతంలో తాను చేయించిన హెల్త్ ఇన్సూరెన్సు కార్యక్రమాన్ని గుర్తుచేసుకున్నారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం, వారి వృత్తిపరమైన అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాజేశ్వర్, ఇస్నాపూర్ ప్రెసిడెంట్ నరేందర్, శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సందీప్, కౌన్సిలర్స్ సంఘన్నగారి గోపాల్, దస్తగిరి, లక్ష్మా రెడ్డి, మురళి, కృష్ణ యాదవ్, శంకర్, పవన్, రవి, రాజేష్, ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట




# జెమిమా రోడ్రిగ్స్‌కు గాయం..

ఇండియన్ ఉమెన్స్ క్రికెట్ టీమ్ స్టార్ బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్ ఇంజ్యూరీ కారణంగా రాబోయే రెండు బిగ్ టోర్నమెంట్లకు దూరమైంది. ఇంగ్లాండ్ లో జరిగిన 'ద హండ్రెడ్' లీగ్ లో ఆడుతున్న సమయంలో హామ్‌స్ట్రింగ్ గాయం వల్ల ఆమె రాబోయే ఉమెన్స్ ఆసియా కప్ తో పాటు ఏషియన్ గేమ్స్ నుంచి కంప్లీట్ గా రూల్ అవుట్ అయింది. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (సీఓఈ) మెడికల్ టీమ్ ఆమెను పరిశీలించి, గాయం తీవ్రత ఎక్కువ ఉండటంతో రెస్ట్ అవసరమని తెలిపినట్లు బిసిసిఐ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. "ఆగస్టు 3న ఇంగ్లాండ్ లో 'ద హండ్రెడ్' మ్యాచ్ ఆడుతుండగా జెమిమా కుడి తొడ కండరాల గాయానికి గురైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) లో బిసిసిఐ మెడికల్ టీమ్ ఆమెకు క్లినికల్ టెస్టులు నిర్వహించింది. ఈ టెస్టుల్లో ఆమెకు హై-గ్రేడ్ టియర్ ఉన్నట్లు తేలింది" అని బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. దాంతో యూఏఈ వేదికగా జరగబోయే ఆసియా కప్, జపాన్ లో జరగబోయే ఏషియన్ గేమ్స్ కు జెమిమా దూరమవ్వక తప్పలేదు. 25 ఏళ్ల జెమిమా స్థానంలో ప్రతీక రావల్ ను ఉమెన్స్ సెలెక్షన్ కమిటీ రీప్లేస్‌మెంట్ గా ఎంపిక చేసింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు దుబాయ్ వేదికగా ఏసీసీ ఉమెన్స్ ఆసియా కప్ జరగనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్ లోని ఐచి-నగోయా వేదికగా ఏషియన్ గేమ్స్ జరగనున్నాయి. కీలకమైన ఈ రెండు టోర్నీలకు ముందు స్టార్ బ్యాటర్ దూరం కావడం భారత జట్టుకు బిగ్ షాక్ అనే చెప్పాలి. జెమిమా రోడ్రిగ్స్ స్థానంలో ప్రతీక రావల్ ఎంట్రీతో బిసిసిఐ అప్‌డేటెడ్ స్క్వాడ్ ను రిలీజ్ చేసింది.

# సూర్యకుమార్ యాదవ్‌పై కన్నేసిన ఫ్రాంచైజీలు


టీమిండియా మాజీ టీ20 కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టును వీడనున్నాడనే వార్తలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పేలవ ఫామ్‌తో టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కోల్పోయిన సూర్యను వదులుకునేందుకు ముంబై సిద్ధమైందని వార్తలు వచ్చాయి. అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ముంబై ప్రయత్నించినట్లు కూడా ప్రచారం జరిగింది. సూర్య నిష్క్రమణపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినప్పటికీ.. అతను జట్టును వీడటం ఖాయమనిపిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సూర్యకుమార్ యాదవ్ పేలవ ప్రదర్శన ముంబై ఇండియన్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. 13 మ్యాచ్‌ల్లో సూర్య రెండు హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య ఆ జోరును కొనసాగించలేకపోయాడు. అంతేకాకుండా గత ఏడాదిన్నరగా సూర్య.. అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా విఫలమయ్యాడు. పేలవ ప్రదర్శనతో చివరకు కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ సిద్ధమైందనే వాదన వినిపిస్తోంది. అయితే సూర్యను ముంబై వదిలేస్తే అతన్ని తీసుకునేందుకు మూడు ఫ్రాంచైజీలు రెడీగా ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్‌ను తీసుకునే ఫ్రాంచైజీల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ముందు వరుసలో ఉంది. ప్రస్తుతం సూర్య ఫామ్‌లో లేకపోయినా అతని అనుభవం, టీ20 ఫార్మాట్‌కు సరిగ్గా సరిపోయే బ్యాటింగ్ శైలి జట్టుకు ఉపయోగపడుతుందని కేకేఆర్ భావిస్తోంది. అంతేకాకుండా కేకేఆర్‌కు కెప్టెన్ అవసరం ఉంది. సూర్యను తీసుకుంటే కెప్టెన్సీతో పాటు మిడిలార్డర్ బ్యాటర్ లోటును తీర్చుకోవచ్చని భావిస్తోంది. అవసరమైతో సూర్య కోసం ముంబైతో కేకేఆర్ ట్రేడ్ డీల్స్ జరపనుంది. వేలంలోకి వచ్చినా కోట్ల రూపయాలను కుమ్మరించనుంది. సూర్యకుమార్ యాదవ్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ కూడా పోటీపడనుంది. అయితే అతని కోసం తమ స్టార్ ఆటగాళ్లను వదులుకునేందుకు లక్నో సిద్ధంగా లేదు. ఈ క్రమంలోనే ముంబైతో ట్రేడ్ డీల్‌కు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఒకవేళ సూర్య వేలంలోకి వస్తే అతన్ని కొనుగోలు చేసే ప్రయత్నం చేయనుంది. ఎందుకంటే లక్నోకు కూడా కెప్టెన్సీతో పాటు ఓ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఉంది. సూర్య కోసం రాజస్థాన్ రాయల్స్ కూడా పోటీ పడనుంది. అవసరమైతే ముంబై ఇండియన్స్‌తో ట్రేడ్ డీల్‌కు ప్రయత్నాలు కూడా చేయవచ్చు. సూర్య కోసం యశస్వి జైస్వాల్‌ను కూడా వదులుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ సిద్ధంగా ఉంది. టాప్ క్లాస్ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఆ జట్టుకు ఉంది. అంతకంటే అనుభవం కలిగిన సారథి ఆ జట్టుకు కావాలి. సూర్య రాకతో ఈ రెండు సమస్యలను అధిగమించవచ్చని రాజస్థాన్ రాయల్స్ భావిస్తోంది.



## టోబీ అల్బర్ట్ సిక్సర్ల విధ్వంసం

ఇంగ్లాండ్‌లో జరుగుతున్న మెట్రో బ్యాంక్ వన్డే కప్‌లో హాంప్‌షైర్ బ్యాటర్ టోబీ అల్బర్ట్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో సంచలనం సృష్టించాడు. మైదానంలో నాన్‌స్టాప్‌గా విరుచుకుపడిన అతను వరుసగా 6 బంతుల్లో 6 సిక్సర్లు బాది క్రికెట్ ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. 21 పరుగుల వద్ద క్యాచ్ డ్రాప్ అయి లభించిన అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకుని కేవలం 37 బంతుల్లోనే 86 పరుగుల నాటౌట్ ఇన్నింగ్స్ ఆడి హాంప్‌షైర్ జట్టుకు భారీ స్కోరు అందించాడు.క్రికెట్ చరిత్రలో హర్షెల్ గిబ్స్ (2007 వన్డే వరల్డ్ కప్), యువరాజ్ సింగ్ (2007 టీ20 వరల్డ్ కప్) ఒకే ఓవర్లో 6 సిక్సర్లు కొట్టి రికార్డు సృష్టించారు. అయితే టోబీ అల్బర్ట్ రికార్డు కాస్త భిన్నమైనది. ఇతను ఒకే ఓవర్లో కాకుండా రెండు వేర్వేరు ఓవర్లలో కలిపి ఈ వరుస 6 సిక్సర్ల ఘనతను సాధించాడు. మొదట నాంటెస్ ఓస్తుయిజెన్ వేసిన ఓవర్ చివరి రెండు బంతులను సిక్సర్లుగా మలిచాడు. ఆ తర్వాత ఓలీ కిర్బీ వేసిన తదుపరి ఓవర్లోని చివరి 4 బంతులను వరుసగా సిక్సర్లుగా మలచి వరుసగా 6 బంతుల్లో 6 సిక్సర్ల మార్కును అందుకున్నాడు. టోబీ అల్బర్ట్ 21 పరుగుల వద్ద ఉన్నప్పుడు ససెక్స్ ఫీల్డర్లు అతనికి ఒక సులువైన క్యాచ్‌ను నేలపాలు చేసి లైఫ్ లైన్ ఇచ్చారు. అక్కడి నుంచి గేర్ మార్చిన టోబీ, మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 37 బంతుల్లో 8 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 86 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. టోబీ అల్బర్ట్ కంటే ముందు హాంప్‌షైర్ ఓపెనర్లు అలీ ఓర్ (105), బెన్ మేస్ (109) కూడా అద్భుతమైన సెంచరీలతో రాణించారు. ఈ ముగ్గురు బ్యాటర్ల తుఫాను ఇన్నింగ్స్‌ల పుణ్యమా అని హాంప్‌షైర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 383 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 384 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ససెక్స్ జట్టు, హాంప్‌షైర్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక 332 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో హాంప్‌షైర్ జట్టు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



## సినిమా
CINEMA



# మళయాళంలోనూ ఎంట్రీ ఇచ్చిన రుక్మిణీ వసంత్

కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చి, సౌత్ ఇండియా మొత్తాన్ని తన నటనతో, క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది రుక్మిణీ వసంత్. ఇప్పటికే కన్నడ, తమిళం, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ సరసన కథానాయికగా రుక్మిణి ఎంపికైంది. 'జయ జయ జయ జయ హే' వంటి సెన్సేషనల్ హిట్‌ను అందించిన దర్శకుడు నషిద్ ఫామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఒక్క మలయాళం మాత్రమే కాదు ప్రస్తుతం సౌత్ లోని బడా ప్రాజెక్టులన్నీ రుక్మిణీ వసంత్ డైరీలోనే ఉన్నాయి. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్' లో రుక్మిణి కీలక పాత్ర పోషిస్తోంది.

# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక

టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.








# చిట్యాలలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**అక్షర కలం : చిట్యాల**

నల్గొండ జిల్లా చిట్యాల మండల ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను బుధవారం చిట్యాల కనకదుర్గమ్మ గుడి వద్ద ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు దేవనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు ఏళ్ల బయ్యన్న, తెలంగాణ రాష్ట్ర మహిళా సహాయ కార్యదర్శి ఏళ్ల మాధవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుని ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ప్రచార కార్యదర్శి ముప్పా సుఖేందర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల ఆనంద్, మండల ప్రధాన కార్యదర్శి కురాకుల సుధీర్, మండల కోశాధికారి చొప్పరి లింగస్వామి, గాలి యాదగిరి, ఏనుగు రవీందర్ రెడ్డి, నూనె యాదగిరి, మెండే నరసింహ, నల్ల నర్సిరెడ్డి, కన్నెబోయిన నరేందర్ యాదవ్, గంజి గోవర్ధన్, చిర్రబోయిన రవీందర్, గుండాల లింగస్వామి, ఎద్దు శేఖర్, జటంగి శేఖర్, పబ్బు సత్తయ్య, అవిశెట్టి మల్లేష్, శ్రీ రామోజు నరేష్, మూడు దుద్ల శ్రీకాంత్, శ్రీధర్, చిర్రబోయిన రమేష్, చాపల సతీష్ తదితర ఫోటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల హక్కులు కాపాడాలి : సీఐటీయూ డిమాండ్



**అక్షర కలం : చిట్యాల**

నల్గొండ జిల్లా చిట్యాల మండల గ్రామ పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు అమలుచేసి తక్షణమే కార్మిక హక్కులను కాపాడాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం చిట్యాల మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులపై భారం పెంచుతున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకుముందు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీఓ జె. పాండు, ఎంపీఓ కోటేష్, సూపరింటెండెంట్ మనోహర్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ సభ్యురాలు మంకాల బాలమ్మ, జిల్లా కమిటీ సభ్యులు సిరిపంగి యాదయ్య, యూనియన్ మండల నాయకులు చిరుమర్తి బిక్షపతి, గుర్రం లింగస్వామి, అరూరి మల్లేష్, నర్సింహా, స్వరూప, సువర్ణ, నిర్మల, సుజాత, అండాలు, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల మగ్గం కూలీలు పెంచాలి


**అక్షర కలం, చౌటుప్పల్**



సంస్థాన్ నారాయణపురం మండలం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికుల స్థితిగతులపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిత్య అవసరాలు పెరిగినందువలన చేనేత కార్మికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం అతి కష్టంగా మారడం వలన చేనేత కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక పరిస్థితి నెలకొన్నది. కావున చేనేత కార్మికుల వేతనం ఒక చీరకు 500 రూపాయలు పెంచాలని సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు చెరిపెల్లి లక్ష్మయ్య,ఉపాధ్యక్షులు సింగం కృష్ణ,పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు విడం సాయి కిషోర్ నేత,చేనేత సహకార సంఘం కార్యదర్శి దోర్నాల అంజయ్య,గంజి అంజయ్య,గర్దాస్ రాఘవేంద్ర,సంగిశెట్టి నరేష్,దోర్నాల బిక్షపతి,మేకని రామకృష్ణ,దోర్నాల దాసు,మేకని అంజయ్య,కర్నాటి నరేష్,కర్నాటి నవీన్,చేనేత కార్మికులు,తదితరులు, పాల్గొన్నారు.

## మున్సిపల్ ఫోటోగ్రాఫర్ జక్కుల రాజు కు ఘన సన్మానం

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 19:**



జిల్లా కేంద్రమైన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని, గత 20 సంవత్సరాలుగా మున్సిపల్ కార్పొరేషన్ కు విశేష సేవలు అందిస్తున్న సీనియర్ ఫోటోగ్రాఫర్ జక్కుల రాజు ను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జక్కుల రాజుకు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్ లు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. అనంతరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ జి రాజు శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ జి రాజు లు మాట్లాడుతూ, దశాబ్దాలుగా సంస్థ పురోగతిలోనూ, కార్యక్రమాల చిత్రీకరణలోనూ రాజు చూపుతున్న అంకితభావాన్ని కొనియాడారు. మున్సిపల్ అభివృద్ధి పనులను, ప్రజోపయోగ కార్యక్రమాలను కెమెరా లెన్స్ లతో రికార్డు చేస్తూ, రాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు.

# 75% హాజరు తప్పనిసరి

**--ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సాధించండి**

**--జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**

**-- కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వెల్లడి**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రిన్సిపల్స్ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం తన ఛాంబర్లో ఇంటర్ విద్య పై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దశ్రు నాయక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ తో సమీక్షించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చినప్పుడు ప్రవేశాల సంఖ్య కూడా పెరుగుతుందని కలెక్టర్ అన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాలో ఉన్న 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు గాను 9 కళాశాలలో విద్యార్థుల నమోదు శాతం పెరిగిందని,నమోదు శాతం తక్కువగా ఉన్న కళాశాలలు ప్రిన్సిపల్స్ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్ కళాశాలల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని ,కళాశాలలో చేరిన విద్యార్థులందరూ మధ్యలో ఇంటర్ కళాశాల మానివేయకుండా చూడాలని, కనీసం 75శాతం హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా హాజరు శాతం తక్కువగా ఉన్నచోట విద్యార్థుల తల్లిదండ్రులకు లేఖలు పంపాలని చెప్పారు. తరగతి గదిలో వెనుకబడిపోయిన విద్యార్థులను గుర్తించి వారికి సాయంత్రము 4 నుండి 5 లేదా మధ్యలో ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, ఒక్కో విద్యార్థిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వారు చదువులో పురోగతిలోకి వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులం దరూ తప్పక ఉత్తీర్ణులు కావాలని, ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని అన్నారు. ఇంటర్ విద్య తర్వాత ఖాళీగా ఉండకుండా ఏదో ఒక వృత్తి, ఉద్యోగాలలో స్థిరపడే విధంగా చదువును నేర్పించాల్సిన అవసరం ఆధ్యాపకులు, ప్రిన్సిపల్స్ పై ఉందని చెప్పారు. సెప్టెంబర్లో మరోసారి ఎఫ్ ఎల్ ఎన్ పరీక్ష నిర్వహించాలని ఆయన చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టిన పనులపై కలెక్టర్ సమీక్షిస్తూ పనులు ప్రారంభించిన చోట త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి నిర్ణయాలు

**--నియోజకవర్గం దాటి బెల్ట్ షాపుల నిర్మూలన దిశగా కదులుతున్న పల్లెలు**

**-- బెల్ట్ షాపులను అరికట్టాలంటూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్న పంచాయతీలు**

**అక్షర కలం, చౌటుప్పల్**



మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుంటూ నియోజవకవర్గంలో అమలుపరుస్తున్న తీరును స్ఫూర్తిని ఇతర నియోజవకర్గ పల్లెలు కూడా అమలులోకి తీసుకొస్తున్నాయి.ఇప్పటికే మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా బెల్ట్ షాపుల నిర్మూలన కార్యక్రమం చాలా కఠినంగా అమలవుతోంది.బెల్ట్ షాపులు లేకపోవడంతో మునుగోడు నియోజకవర్గ గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంది క్రైమ్ రేట్ తగ్గిందని నివేదికలు చెబుతున్నాయి.రాజ్ గోపాల్ రెడ్డి గారి స్ఫూర్తితో ఇప్పటికే నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాల మండలం తాళ్ల వెల్లెంల,ఏపూర్,పెద్దకాపర్తి,పేరేపల్లి గ్రామాలలో బెల్ట్ షాపుల నిర్మూలనకు పంచాయతీలు తీర్మానాలు చేసి అమలుపరుస్తుండగా నల్గొండ నియోజకవర్గంలోని కనగల్ మండల కేంద్ర గ్రామపంచాయతీ కూడా బెల్ట్ షాపుల నిర్మూలకు తీర్మానం చేసింది.కనగల్ మండల కేంద్రంలో బెల్ట్ షాపులు నిర్వహించకూడదని ఒకవేళ తీర్మానాన్ని ఉల్లంఘిస్తే 50 వేల జరిమానా విదిస్తామంటూ తీర్మానంలో పేర్కొన్నారు.

**--ప్రతి పక్ష ఎమ్మెల్యే గా ఉన్నపుడే బెల్ట్ షాపుల నిర్మూలన నిర్ణయం..**

2018 లో ఎమ్మెల్యేగా గెలిచినపుడే రాజ్ గోపాల్ రెడ్డి గారు గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్మూలించాలని పిలుపునిచ్చారు.నిర్మూలించిన గ్రామాలకు అబివృద్ధి నిదులను ఇస్తానని మాటిచ్చారు.నారాయణ్ పూర్ మండలం అల్లందేవిచెరువు టీఆర్ఎస్ సర్పంచి బెల్ట్ షాపులను నిర్మూలిస్తే తన మాత్రుమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద 6 లక్షల రూపాయలు అభివృద్ధికి నిదులు ఇచ్చారు.అపుడు ప్రతిపక్షంలో ఉండడం వల్ల రాజ్ గోపాల్ రెడ్డి గారు తీసుకున్న నిర్ణయాలు అమలుకాలేకపోయాయి.2023 లో తిరిగి ఎమ్మెల్యే గా గెలవడం ప్రజాప్రభుత్వం అదికారంలోకి రావడంతో తన నిర్ణయాన్ని అమలులోకి తీసుకొచ్చాడు.అమలు ఫలితంగా మునుగోడు నియోజకవర్గ గ్రామాలలో వస్తున్న ఫలితాలతో పక్క నియోజకవర్గ పల్లెల్లోని ప్రజలు కూడా బెల్ట్ షాపులను మూసివేసే దిశగా ముందుకుసాగుతున్నారు.మునుగోడు ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి ని స్ఫూర్తిగా తీసుకొని పల్లెలు బెల్ట్ షాపుల నిర్మూలనకు శ్రీకారం చుడుతున్నాయి.

# ఇందిరమ్మ ఇండ్ల అవినీతిపై వేటు

**-- లంచం తీసుకున్న తిరుమలగిరి సాగర్ ఏఈ తొలగింపు**

**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**



ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లబ్ధిదారు నుండి డబ్బులు తీసుకున్నట్లు విజిలెన్స్ విచారణలో రుజువైనందున నల్గొండ జిల్లా, తిరుమలగిరి సాగర్ మండల గృహ నిర్మాణ శాఖ ఔట్సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ బుక్యా గోపిని వెంటనే ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏఈ బుక్యా గోపి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు డబ్బులు తీసుకుంటున్నారని లబ్ధిదారులు రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ కు ఫిర్యాదు చేయగా, ఈ ఫిర్యాదు పై స్పందించిన రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఈ విషయంపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. విజిలెన్స్ విచారణలో ఏ ఈ డబ్బులు తీసుకున్న విషయం నిజమని తేలడంతో, విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరులో అక్రమాలకు పాల్పడినందుకు గాను భూక్య గోపిని తక్షణమే ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎవరు అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించి అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరు అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ఫిర్యాదులను లబ్ధిదారులు తనకు గాని, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 18004251442, 18005995991 లకు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

# నాణ్యమైన చదువు.. శుభ్రమైన వాతావరణం

**--గురుకులాలు, వసతి గృహాల్లో చదువుతో పాటు పరిశుభ్రతకూ ప్రాధాన్యం ఇవ్వాలి**

**-- జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**

**--గుండ్లపల్లి సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ**

**-- మంజూరైన రూ.26 లక్షలతో మౌలిక వసతుల పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశం**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలో చదువుతోపాటు, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ప్రిన్సిపల్స్ ను ఆదేశించారు. బుధవారం ఆయన నల్గొండ జిల్లా, గుండ్లపల్లి( డిండి) లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల ఆవరణ, డార్మేటరీ, కిచెన్, స్టోర్ రూమ్, వాష్ రూమ్స్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో చెత్తను ఎప్పటికప్పుడు గ్రామపంచాయతి ట్రాక్టర్ ద్వారా తీసుకువెళ్లాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి జంగయ్య ను ఆదేశించారు.వాష్ రూమ్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని,వాష్ రూమ్ లకు డోర్ లు పెట్టించాలని,అలాగే అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని,ప్రభుత్వం ఇటీవలే పాఠశాల/కళాశాలలో సివిల్ పనుల నిమిత్తం 26 లక్షల రూపాయలు మంజూరు చేసినందున డ్రైనేజీ,తాగునీటి పైప్ లైన్ పనులు,పాఠశాల భవన మరమ్మతులు, తదితర పనులను వెంటనే చేపట్టాలని డి ఈ శైలజను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ స్టోర్ రూమ్ ను సందర్శించి సరుకుల స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు.స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు నిర్వహించాలని,గడువుదాటిన సరుకులు వాడవద్దని,నెలకు సరిపడా సరుకులు మాత్రమే తెప్పించుకోవాలని,తాజా కూరగాయలు వాడాలని,పుచ్చిపోయినవి వాడవద్దని ప్రిన్సిపల్ శిరీష, స్టోర్ కీపర్ల ను ఆదేశించారు.వంట సరుకులు వృధా చేయవద్దని,రోజుకు సరిపోయినంత సరుకులు వాడాలని,వంట మనుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,చేతులకు గ్లౌజులు ,తలకు కవర్ ధరించాలని వంట వారిని ఆదేశించారు. బాలికలకు ఆత్మరక్షణలో భాగంగా కరాటే వంటివి నేర్పించాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, సమస్యలు,తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్,ఎంపిడివో వైజన,సర్పంచ్ రవి తదితరులు ఉన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ–సూర్యాపేట–యాదాద్రి

# అన్‌మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు

**-- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో జిల్లాల కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్**

**-- క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశం**





**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**

ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం మ్యాపింగ్ కానీ, జాబితాలో పేర్లు తేడా ఉన్న కేసులకు సంబంధించి నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్గొండ జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం 33,818 అన్‌మ్యాపింగ్ 2,34,972 అనామలీస్ ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 6 ఈఆర్‌ఓలు, 12 మంది ఏఈఆర్‌ఓలు ఉన్నారని, అదనంగా మరో 12 మంది ఏఈఆర్‌ఓలు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవడంతో పాటు, క్షేత్రస్థాయిలో బూతు స్థాయి అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి పూర్తి అవగాహన కల్పిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం జారీ చేసే నోటీసులను సంబంధిత బీఎల్‌ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు సక్రమంగా అందజేయాలని చెప్పారు. నోటీసులు అందించిన వ్యక్తుల సంతకాలను తీసుకోవాలని, డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అదేవిధంగా ఫారం–6, ఫారం–7, ఫారం–8లకు సంబంధించిన దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారికి పూర్తి వివరాలను తెలియజేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పూర్తిగా పారదర్శకంగా రూపొందించేలా లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవిన్యూ అధికారి దశరథ, ఎలక్షన్ అధికారులు హాజరయ్యారు.

## మున్సిపల్ చైర్మన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న బీఆర్ఎస్..

**తీవ్రంగా ఖండించిన పార్టీ శ్రేణులు..**

**గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు స్పందిస్తున్నారని ఎద్దేవా..**



**అక్షరకలం,చండూరు**

చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు మంగళవారం రోజు బీఆర్ఎస్‌పై చేసిన వ్యాఖ్యలను స్థానిక బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం చండూరు పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించి చైర్మన్ వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా మునుగోడు నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలకు సంబంధించినవేనని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రగతిపై మాట్లాడితే, వాటిని తమపై చేసిన వ్యక్తిగత ఆరోపణలుగా మార్చుకుని మాట్లాడటం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు" స్పందిస్తున్నారని ఎద్దేవా చేశారు. బాధ్యతాయుతమైన మున్సిపల్ చైర్మన్ పదవిలో ఉండి వాస్తవాలను వక్రీకరిస్తూ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని వారు హితవు పలికారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, చైర్మన్ తీరును బీఆర్ఎస్ శ్రేణులు ముక్తకంఠంతో నిరసిస్తున్నాయని నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ గ్రామ, పట్టణ కమిటీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లారెడ్డిపల్లి--చల్లూరు ప్రయాణికుల అరిగోస

**వీణవంక, ఆగస్టు 19 ( అక్షర కలం ):**



వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి నుండి చల్లూరు వరకు ఉన్న సుమారు మూడు కిలో మీటర్ల ప్రధాన రహదారి అత్యంత అధ్వానంగా తయారైందని, అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడి, వర్షపు నీరు చేరడంతో నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ?ఈ మార్గంలో గత రెండేళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో చల్లూరు హైస్కూల్‌కు వెళ్లే సుమారు 50 మంది విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆటోల కోసం ప్రతి విద్యార్థి నెలకు 800 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని, రోడ్డు సరిగా లేక ఆటోలు కూడా సక్రమంగా రావడం లేదని వాపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారని, వృద్ధులు, రైతులు, మహిళలు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు..

## సమాజ ప్రతిబింబాలు ఫోటో జర్నలిస్టులు --జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**అక్షరకలం నల్గొండ**

187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బుధవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లో ఫోటో జర్నలిస్టులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఫోటో జర్నలిస్టులకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రఫీ పోటీల్లో అవార్డులు సాధించిన ఫోటో జర్నలిస్టులను అభినందించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వంద భావాలను ఒకే దృశ్యంలో ఆవిష్కరించే శక్తి ఫోటోకు ఉందని కొనియాడారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఫోటో జర్నలిస్టుల కృషి అభినందనీయమని ప్రశంసించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్లు అందిస్తున్న సేవలు ముఖ్యమైనవని పేర్కొన్నారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫోటోగ్రఫీ పోటీల్లో అవార్డులు సాధించిన 'సాక్షి' ఫోటో జర్నలిస్ట్ కంది బజరంగ్ ప్రసాద్, 'ది హాన్స్ ఇండియా' ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్‌లను అధికారులు శాలువాతో సత్కరించి అభినందించారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటో జర్నలిస్టులు ముచ్చర్ల విజయకుమార్, కంది శీను, కారింగు శ్రీను, కనకయ్య, కారింగు వెంకన్న, భవాని ప్రసాద్, జర్నలిస్టులు కత్తుల హరి, గోలి నాగరాజు, వై. సాగర్, మేడి వినోద్ తదితరులు పాల్గొన్నారు.



# బాబు" అన్న నోటిపైనే కత్తి వేటు !

**అమ్మలాంటి ఆ ఒకే ఒక్క పిలుపే.. హంతకులను పట్టించింది**

**గురువునే బలిగొన్న "డిజిటల్" వ్యసనం !**

**కొండమల్లేపల్లి ప్రిన్సిపల్ హత్య వెనుక పసిమనసుల నేర కోణం**

**కేసు చేదనలో పోలీస్ వ్యవస్థ అభినందనీయ పనితీరు**

**వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్**

**అక్షరకలం నిఘావిభాగం**

కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి దారుణ హత్య కేసును నల్లగొండ జిల్లా పోలీసులు ఛేదించిన తీరు ఒక ఎత్తయితే.. ఈ నేరం వెనుక బయటపడిన వాస్తవాలు సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. చదువు చెప్పి ప్రయోజకులను చేయాల్సిన గురువునే, పదహారేళ్ల వయస్సున్న విద్యార్థులు దారుణంగా అంతమొందించడం నేటి విద్యావ్యవస్థ, పాఠశాల వాతావరణం, సాంకేతికత దుర్వినియోగంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఆ కేసు వివరాలను బుధవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

**–ఆన్‌లైన్ జల్సాలు.. డిజిటల్ నేరాలు...**

రహస్యంగా ఫోన్లు వాడుతూ యూట్యూబ్, సోషల్ మీడియాలో "సులభంగా డబ్బు సంపాదించడం ఎలా? అని వెతికిన ఈ బాలురు, సాంకేతికంగా దొరక్కుండా హత్య ఎలా చేయాలో కూడా ఇంటర్నెట్ ద్వారానే నేర్చుకోవడం విస్తుగొలుపుతోంది.

**–క్రమశిక్షణను 'కక్ష'గా మార్చుకుని..**

హాస్టల్లో అనైతిక ప్రవర్తనకు పాల్పడినప్పుడు తల్లిదండ్రుల ముందే మందలించారనే చిన్న కారణంతో, కక్ష పెంచుకుని పక్కా పథకం ప్రకారం రెక్కి నిర్వహించి హత్యకు ఒడిగట్టారు.




**హత్యను పట్టించిన 'ఒకే ఒక్క మాట'..**

ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యేముందు రూపారెడ్డి నోటి నుండి వచ్చిన చివరి పదం "బాబు". సాధారణంగా ఆమె తన విద్యార్థులను అలాగే పిలుస్తారని గుర్తించిన పోలీసులు, ఆ ఒక్క ఆధారంతో విచారణను విద్యార్థుల వైపు మళ్లించి కేసును ఛేదించారు.

**పోలీస్ వ్యవస్థ అభినందనీయ పనితీరు..**

ఈ కేసును సవాలుగా తీసుకున్న జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మార్గదర్శకత్వంలో దేవరకొండ డీఎస్పీ నేతృత్వంలోని 5 ప్రత్యేక బృందాలు అత్యంత శాస్త్రీయంగా దర్యాప్తు జరిపాయి. 30 కిలోమీటర్ల పరిధిలో 70 సీసీటీవీ కెమెరాలను విశ్లేషించి, సుమారు 80 మంది అనుమానితులను విచారించిన తీరు వారి సమర్థతకు నిదర్శనం. రక్తం మరకలు ఉన్న నోట్లు, మృతురాలి ఐఫోన్ సహా రూ. 1.54 లక్షల నగదును స్వాధీనం చేసుకుని




నిందితులను అరెస్టు చేశారు.

**--కళ్లు తెరవాల్సిన బాధ్యత ఎవరిది?**

ఈ ఘటన కేవలం పోలీస్ వ్యవస్థ పరిష్కరించే కేసు మాత్రమే కాదు. ఇళ్లలో, హాస్టళ్లలో పిల్లలు ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారు? వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పులు వస్తున్నాయి? అని గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, యాజమాన్యాలపై ఉంది. "బాబు" అని ఆప్యాయంగా పిలిచే నోటిపైనే కత్తితో దాడి చేసే స్థాయికి సమాజం దిగజారడంపై ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేధావులు, విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

**---అభినందనలు...**

ఈ కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ ఎం.వి శ్రీనివాసరావు, మల్లెపల్లి సీఐ ఏ. నవీన్ కుమార్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, మల్లెపల్లి ఎస్ఐ ఏ. రమేష్, చింతపల్లి ఎస్ఐ ఎం. రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ డి. నరసింహులు, గుర్రంపోడు ఎస్ఐ ఎన్. వెంకన్న, సిసిఎస్ ఎస్ఐ యూ. సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు కరుణాకర్, విష్ణువర్ధనగిరి, వహీద్ పాషా, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, ప్రసాద్ రావు, ఫయాజ్, ప్రభాకర్, కానిస్టేబుళ్లు హేము నాయక్, గులాం దస్తగిరి, సాయికుమార్, శివరాజ్, ఎండీ. జునైద్ అహ్మద్, నరేష్, సాయి, కే. కమల్ కిషోర్, వేణుగోపాల్ రెడ్డి, భాస్కర్, శరన్ రెడ్డి, నాగరాజు, అనిల్, హెచ్‌జీ శేఖర్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

## విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**సీఐ ఉపేందర్, ఎస్ఐ క్రాంతి కుమార్**

**తుంగతుర్తిఆగస్టు 19 (అక్షర కలం)**

సైబర్ నేరాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సిఐ ఉపేందర్, ఎస్సై క్రాంతి కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన 'పోలీస్ ప్రజా భరోసా' అవగాహన సదస్సులో ఆయన విద్యార్థినులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, లింకులను క్లిక్ చేయకూడదని, ఓటీపీ, పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించకూడదని సూచించారు. సోషల్ మీడియాను వినియోగించే సమయంలో వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రత కోసం పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. సమస్యలు ఎదురైతే భయపడకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల , ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహేష్ కళ్లు దానం

**రాయికల్ ఆగస్టు19(అక్షర కలం):**

రాయికల్ మండలం వడ్డెర కాలనీ గ్రామానికి చెందిన అలకుంట మహేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. విషాద సమయంలోనూ మహేష్ కుటుంబ సభ్యులు గొప్ప మానవతా నిర్ణయం తీసుకున్నారు. మహేష్ తల్లిదండ్రులు అలకుంట పోచయ్య, లక్ష్మి మరియు సోదరుడు సంతోష్ మహేష్ కళ్లను దానం చేసి మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపారు. మహేష్ కళ్లను హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ నేత్ర ఆసుపత్రి వైద్య బృందం సేకరించింది. భౌతికంగా మన మధ్య లేకపోయినా మహేష్ కళ్ల ద్వారా మరొకరి జీవితంలో వెలుగు ప్రసరించనుంది. అవయవదానం, నేత్రదానం మహాదానం అనే సందేశాన్ని మహేష్ కుటుంబ సభ్యులు తమ చేతల ద్వారా సమాజానికి చాటిచెప్పారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం పట్ల అవగాహన పెంచుకొని మరణాంతరం తమ కళ్ళను దానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ నేత్రదానానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యుల సేవాభావాన్ని గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్, ఉప సర్పంచ్ రాజేష్, మాజీ సర్పంచ్ మన్నెగుండ్ల వెంకమ్మ, ఎస్సై సుధీర్ రావు, ఏఎస్సై దేవేందర్, ఫోరెన్సిక్ వైద్యులు శ్రీనివాస్, నరేష్, రాజలింగం, పాపయ్య తదితరులు కుటుంబాన్ని పరామర్శించి అభినందించారు.



# మృతునికి నివాళులర్పించి- ఆర్థిక సాయం అందించిన కాంగ్రెస్ నేత "చల్లా కృష్ణ"

**అక్షర కలం/ దానవాయిగూడెం:**



పాలేరు, నియోజకవర్గ పరిధిలోని 59వ, డివిజన్ దానవాయిగూడెం కాలనీ కి చెందిన చల్లా యాదగిరి ఇటీవల కాలంలో అనారోగ్యశీ కారణంగా మరణించారు. విషయం తెలుసుకున్న రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు తుంబురు దయాకర్ రెడ్డి సలహామేరకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం కార్పొరేషన్ జనరల్ సెక్రటరీ" చల్లా కృష్ణ " మృతుల కుటుంబాన్ని పరామర్శించి , ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి మనోధైర్యం ని నింపారు, బుధవారం"దశదిన కార్యక్రమానికి " తమ వంతు సహాయం గా "చల్లాకృష్ణ " 5,000/ రూపాయలు కుటుంబసభ్యులకు అందజేశారు. వారి కుటుం బానికిఎల్లపుడూ కాంగ్రెస్ పార్టీ తరుపున అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో "చల్లా కృష్ణ" టీమ్ సభ్యులు పాల్గొనడం జరిగిందని పేర్కొన్నారు.

# గుగులోత్ లాల్సింగ్ దశ దిన కర్మలకు హాజరైన వి. పార్వతి హతీరామ్ నాయక్.



**అక్షర కలం ఇల్లందు ప్రతినిధి:-**

గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి పార్వతి హాథీరామ్ నాయక్ బొమ్మనపల్లి గ్రామం లో బుధవారం గూగులోతు వీరయ్య తండ్రి గూగులోతు లాల్ సింగ్ దశ దిన కర్మ కార్యక్రమం నకు హాజరై వారి చిత్ర పటానికి పూలతో నివాళ్ళు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు గూగులోతు హనుమంతు నాయక్ తండా నాయక్, వంకుదోత్ రత్నా నాయక్, జంకిలాల్ నాయక్,వసియా నాయక్,లక్ష్మణ్,సరోజ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదు తుది జాబితాలో తమ పేరు ఉన్నదో లేదోసరి చూసుకోవాలి.--- 12వ వార్డు కౌన్సిలర్ రంప రమ్య జాన్సన్.

**అక్షర కలం ఇల్లందు ప్రతినిధి:-**



గడచిన దినాల్లో సర్ ఓటర్ల సమగ్ర సర్వేలో భాగంగా ఓటర్ల సవరణ చేయడం జరిగిన విషయం ప్రజలందరికీ విదితమే. మన 12వ వార్డులోని కమ్యూనిటీ హాల్ వద్ద 98వ పోలింగ్ స్టేషన్, అంగన్వాడీ కేంద్రం వద్ద 99 వ పోలింగ్ స్టేషన్' జెకె కాలనీ సింగరేణి స్కూల్ వద్ద 117వ పోలింగ్ స్టేషన్ ఓటర్ల జాబితాను నోటీస్ బోర్డ్ లో ఏర్పాటు చేయడం జరిగినదని, ఇల్లందు పట్టణ 12 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ రంప రమ్య జాన్సన్ తెలిపారు. పైన తెలిపిన పోలింగ్ స్టేషన్లో ఓటర్ లిస్టు ఏర్పాటు చేయడం జరిగిందని ఓటర్లు వెళ్లి తమ ఓటు నమోదు అయిందా లేదా తెలుసుకోవాలని ఓట్లు ఉన్నాయా లేదా అని చూసుకొని, ఓటు నమోదై ఉంటే పర్వాలేదని ఓటు నమోదు కాకపోతే వెంటనే వార్డు కౌన్సిలర్ కు తెలియజేయాలని కౌన్సిలర్ రంప రమ్మ జాన్సన్ తెలిపారు. అంతేకాకుండా నమోదైన ఓటరు పేరు అడ్రస్ లో తప్పుగా ఉంటే ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల మన వార్డు బిఎల్ వో 98వ పిఎస్ హైమావతి, అలాగే 99వ పిఎస్ బిఎల్ వో ఆదిలక్ష్మి , 117 పి ఎస్, బి ఎల్ వో సుశీల ను కలిసి విషయాన్ని తెలపాలని కౌన్సిలర్ సూచించారు. 12 వ వార్డు ఓటర్లకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ నెంబర్లు మారినవని దయచేసి గమనించాలని కౌన్సిలర్ రంప రమ్య జాన్సన్ కోరారు.

## పాత పెన్షన్ సాధనకై చలో హైదరాబాద్ బహిరంగ సభను విజయవంతం చేద్దాం

**గద్వాల్ అక్షర కలం ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర కంట్రీ బ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్(టిఎస్ సిపిఎస్ ఈయూ) ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని ఆగస్టు 23వ తేదిన చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్ను భోజన విరామ సమయంలో స్థానిక గద్వాల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల టీచర్ కాంప్లెక్స్ యందు మరియు పీఎం శ్రీ అనంతపురం హైస్కూల్ ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ నందు పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నరసింహ మాట్లాడుతూ – రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ విధనాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్, జార్ఖండ్, చత్తీస్ ఘడ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో పాత పెన్షన్ విధానాన్ని తెచ్చినట్లుగానే తెలంగాణలో కూడా తీసుకు రావాలని కోరారు. ఆగస్టు 23వ తేదిన చలో హైదరాబాద్ కార్యక్రమంకు రాష్ట్రంలోని 2.6 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ కోసం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



# పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై పీడీ యాక్ట్ : పోలీస్ కమిషనర్

**అక్షర కలం/ ఖమ్మం ఉమ్మడి బ్యూరో:**

పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ చేయడం, అంతర్రాష్ట్రాలకు తరలించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ అక్రమంగా ఆర్థిక లాభాలు ఆర్జిస్తున్న కాజా రామారావు ఏ జయంతి రామారావుపై పీడీ యాక్ట్‌ను అమలు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిందితుడు కాజా రామారావు రేషన్ డీలర్లు, వారి ఏజెంట్ల ద్వారా కార్డుదారులకు అందాల్సిన సబ్సిడీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించేలా లబ్ధిదారుల బయోమెట్రిక్ వేలిముద్రలను దుర్వినియోగం చేసి బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయిస్తున్నట్లు తెలిపారు. 2026 ఏప్రిల్ 28 నుంచి మే 26 వరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం, చంద్రుగొండ పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోలు సంబంధించి మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసుల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్ (ఈసీ యాక్ట్), తెలంగాణ పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్స్‌కు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలోనూ ఇదే తరహా కేసులు నిందితుడిపై 2024లో కూడా ఖమ్మం జిల్లాలోని



తల్లాడ, కల్లూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారానికి సంబంధించి మరో రెండు కేసులు నమోదయ్యాయని, అయినప్పటికీ తన అక్రమ కార్యకలాపాలను మార్చుకోకుండా కొనసాగించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యకలాపాల ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉద్దేశించిన ఆహార భద్రత వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతోందని, సమాజానికి అవసరమైన నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థను కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై గతంలో పలుమార్లు కేసులు నమోదు కావడంతో పాటు, బీఎన్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసినప్పటికీ తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని, ఈ నేపథ్యంలో పీడీ యాక్ట్ అమలు చేసి సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం కాజా రామారావును బుధవారం అదుపులోకి తీసుకోని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలు తరలించడం జరిగింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్పష్టం చేశార.

# టెక్నాలజీఅభివృద్ధివిద్యకు ఉపయోగపడాలి-- ఫోటోగ్రాఫర్లకు న్యాయంజరగాలి.

**అక్షర కలం / భద్రాచలం**



బుధవారంరోజు న భద్రాచలంలో ఫోటోగ్రాఫర్స్ఆధ్వర్యంలోఫోటోగ్రాఫర్ డెని ఘనంగానిర్వహించుకోవడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. టెక్నాలజీ అభివృద్ధి చెందడంతప్పుకాదు. ఆధునికసాంకేతికతనువిద్యకు, ఉపాధికి, నైప ుణ్యాభివృద్ధికి, యువతభవిష్యత్తుకుఉపయోగించుకుంటేసమాజా నికిఎంతోమేలుజరుగుతుందికానీ, టెక్నాలజీపేరుతోసంవత్సరాల ంగాఒకకళగా, ఒకవృత్తిగాకొనసాగుతున్నఫోటోగ్రఫీపై ఒత్తిడిపెరగడంమాత్రంచాలాబాధాకరం. ఒకప్పుడు ఫోటోగ్రాఫర్లపై ఆధారపడిన అనేక పనులు నేడు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా మరియుఇతరసాంకేతికమార్పులవల్లతగ్గిపోతున్నాయి. దీనివల్ల ఈ వృత్తిపై ఆధారపడిజీవిస్తున్న వేలాది మందిఫోటోగ్రాఫర్లుఆర్థికంగాఇబ్బందులుఎదుర్కొనేపరిస్థితిఏర్ప డుతోంది. టెక్నాలజీని ఆపడం మా ఉద్దేశం కాదు. టెక్నాలజీ అభివృద్ధిచెందాలి, కానీదానివల్లఒకవృత్తిపూర్తిగాదెబ్బతినకూడదు. కొత్తటెక్నాలజీతో పాటు వృత్తి ఫోటోగ్రాఫర్లకు కూడాఆధునికశిక్షణ, కొత్తపరికరాలపై అవగాహన, ప్రభుత్వ ప్రోత్సాహం, ఉపాధి అవకాశాలుమరియుప్రత్యేక సంక్షేమపథకాలుఅందించాలి. ప్రభుత్వంసోషల్. మీడియారంగా న్నిప్రోత్సహిస్తున్నట్లుగానే, సమాజంలోనిముఖ్యమైనక్షణాలనుతమ కెమెరాల్లోశాశ్వతంగానిలుపుతున్నవృత్తిఫోటోగ్రాఫర్లనుకూడాగు ర్తించిఆదుకోవాలి. మామనవిఒక్కటే. టెక్నాలజీఅభివృద్ధిచెందాలి. విద్యకు, ఉపాధికిఉపయోగపడాలి. కానీ ఫోటోగ్రాఫర్ల వృత్తిపైభారంకాకూడదు. ప్రభుత్వంఈవిషయాన్నిగుర్తించి, ఫోటో గ్రాఫర్లకుప్రత్యేక ప్రోత్సాహం, ఆధునిక శిక్షణమరియుసంక్షేమకార్యక్రమాలు అందించిఈవృత్తినిఆదుకోవాలనిప్రపంచఫోటోగ్రఫీడేసందర్భంగ ామనవిచేస్తున్నాము. ఫోటోగ్రఫీ ఒక కళ మాత్రమే కాదు ఎన్నో కుటుంబాలకు జీవనాధారం కూడా. అని వారు తెలియజేశారు

# దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది...

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**

**దివ్యాంగులకు ఉచితంగా త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్ళ పంపిణీ చేసిన మంత్రి**

**అక్షర కలం/ ఖమ్మం ఉమ్మడి బ్యూరో**



దివ్యాంగుల సంక్షేమానికి, వారి ఆర్థిక, సామాజిక వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం తరపున వంద శాతం సబ్సిడీపై సమకూర్చిన త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్ళను బుధవారం కూసుమంచి క్యాంపు కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా, తమ స్వశక్తితో జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. రవాణా సౌకర్యం సులభతరం కావడానికి ఈ ట్రై మోటార్ సైకిళ్లు ఎంతో తోడ్పడతాయని అన్నారు. దివ్యాంగత్వాన్ని వైకల్యంగా భావించకుండా, బలమైన ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. సరైన పట్టుదల ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ లేదని, దివ్యాంగులు సమాజంలో స్వయం సమృద్ధి సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వ పథకాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దివ్యాంగ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫోటో జర్నలిస్టు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం

**ఒక్క ఫోటో ఎన్నో జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది**

**సమాజంలో ఫోటో గ్రాఫర్లకు కీలక పాత్ర**

**డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించేందుకు సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజక ఇన్చార్జ్ పూజల హరికృష్ణ దృష్టికి తీసుకెళ్తాం**

**సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్**

**అక్షర కలం సిద్దిపేట ఆగష్టు 19:**

ఫోటో జర్నలిస్టు సమస్యలు పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తా అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని సిద్ధిపేట జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఫోటో జర్నలిస్టులను సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ రంగానికి ఫోటో జర్నలిస్టులు అందిస్తున్న సేవలను గొప్పవి అని అన్నారు. సమాజంలో జరిగే ప్రతి ముఖ్యమైన సంఘటనను చిత్ర రూపంలో భద్రపరచడంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం అని అన్నారు. ఒక ఫోటో వెయ్యి మాటలకు సమానం అని ఒక్క ఫోటో ఎన్నో జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది అని అన్నారు. ప్రజా సమస్యలను ముందుకు తీసుకురావడంలో ఫోటో జర్నలిస్టులు కూడా కృషి చేస్తారు అని అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఫోటోగ్రఫీ రంగంలో అనేక మార్పులు వచ్చినప్పటికీ, మంచి చిత్రాన్ని తీసేందుకు అవసరమైన సృజనాత్మకత ఎప్పటికీ ముఖ్యం అని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించేందుకు సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజక ఇన్చార్జ్ పూజల హరికృష్ణ దృష్టికి తీసుకెళ్తా అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ చైర్మన్ రైస్ ఉద్దీన్. అసెంబ్లీ ప్రెసిడెంట్ వాహబ్ పట్టణ యువజన అధ్యక్షులు గయాజుద్దీన్, విజయ డానియల్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదలకు వరం

## ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

**అక్షర కలం సిద్దిపేట ఆగష్టు 19:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం పేదలకు వరమని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కమ్మర్లపల్లిలో లబ్దిదారులు నిర్మించిన ఇందిరమ్మ గృహాల్లో నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరితో కలిసి ప్రత్యేక పూజలు చేసి గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేరుస్తుందన్నారు. ఈ పథకాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏండ్ల పాలనలో పేదలను మోసం చేసిందన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేకనే తమ ఉనికిని కాపాడుకోవడనికి స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావ్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని, వారికీ సరి అయినా సమయంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, భూపతి రెడ్డి ,డీసీసీ ప్రధాన కార్యదర్శి సంద బోయిన పరుశురాం యాదవ్, ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా మాజీ కన్వీనర్ పొన్నాల రాజేష్, ఎస్సీ డిపార్ట్మెంట్ మండల అధ్యక్షుడు మంద శ్రీకాంత్, ఎస్సీ డిపార్ట్మెంట్ మండల మాజీ అధ్యక్షుడు కొమ్ము ప్రశాంత్, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఉడుత ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు అనంతగిరి చంద్రశేఖర్, అల్లిపూర్ ఉపసర్పంచ్ కొలనుపాక శ్రీనివాస్ రెడ్డి, ఎల్లయ్యపల్లి ఉపసర్పంచ్ మీసం రాజు, కమర్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కాలువ జగన్, వార్డ్ మెంబర్ జీల రాకేష్, ఇంద్రమ్మ కమిటీ సభ్య డు జక్కుల నాగరాజు, గ్రామ కాంగ్రెస్ నాయకులు వద్లూరి అశోక్, సంజీవ్, శ్రీనివాస్ రెడ్డి, అంజి, శ్రీనివాస్ రెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955